క్లుప్తంగా...

నేడు ఆర్జీకేలో షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

పోచారం: అన్నోజిగూడలోని ఆర్జీకే కాలనీలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను గురువారం కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తారు. 7వ వార్డులో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసి, ఎన్ఏసీ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ తీసుకున్న మహిళలకు మిషన్లు అందజేస్తారు.

గుడులు, బడులకు నూతన శోభ



శామీర్‌పేట్: స్థానిక జిల్లా మంత్రి చామకూర మల్లారెడ్డితో గుడులు, బడులు నూతన శోభను సంతరించుకుంటున్నాయని సర్పంచ్ గుర్క కుమార్‌యాదవ్ అన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో బుధవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ, గండిమైసమ్మ అమ్మవార్ల ఆలయాల నిర్మాణానికి సర్పంచ్ గుర్క కుమార్, స్థానిక నాయకులు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, వార్డుసభ్యులు మధుసూదన్ రెడ్డి, రాజు, లింగం, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకే డబుల్ ఇళ్లు



కీసర: పేదలకు అందాల్సిన ప్రభుత్వ పథకాలను అధికార పార్టీ నాయకులు, అనుచరులకు బీఆర్ఎస్ ప్రభుత్వం, పాలకులు పంపిణీ చేయడం సిగ్గుచేటని సీపీఐ మేడ్చల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్ అన్నారు. బుధవారం కీసర అంబేడ్కర్ చౌరస్తా వద్ద కీసర మండల సీపీఐ సహాయ కార్యదర్శి వీవీ రవినాయక్ ఆధ్వర్యంలో పేదలకు పంచాల్సిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను బీఆర్ఎస్ నేతలు, అనుచరులకు పంపిణీ చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో అధికారులు సర్వే చేసి అర్హులకు డబుల్ ఇళ్లు పంపిణీ చేయాలన్నారు. బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు రాములుగౌడ్, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి స్వరూప, కీసర మండల సహాయ కార్యదర్శి రవినాయక్, భవనకార్మిక సంఘం నేతలు నర్సింహులు, ధీరావత్ కమిలిబాయ్ తదితరులు పాల్గొన్నారు.

బొలేరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి



శామీర్‌పేట్: స్కూటీని బొలేరో వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మందాయిపల్లికి చెందిన తాడెం ఆంజనేయులు(40), స్కూటీపై పోతాయిపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. గ్రామంలోని చెరువు సమీపంలోకి చేరుకోగానే బొలేరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న ఆంజనేయులు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామని, కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్సై మునీందర్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ప్రకటించే అభ్యర్థికే పూర్తి మద్దతు

మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీ ప్రకటించే అభ్యర్థికే పూర్తి మద్దతు ప్రకటిస్తామని మల్కాజిగిరికి కాంగ్రెస్ పార్టీ నేతలు పేర్కొన్నారు. మల్కాజిగిరి శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు జీడీ సత్యనారాయణగౌడ్, సిరిగిరి నర్సింగరావు మాట్లాడుతూ దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో పదవులు లేకున్నా పనిచేస్తున్నామన్నారు. పార్టీ అధికారంలో రావడానికి అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్నారు. నందికంటి శ్రీధర్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారని, తొందరపాటుగా పార్టీకి రాజీనామా చేశారన్నారు. ఇప్పటికి ఇంకా పార్టీ అభ్యర్థిని ప్రకటించలేదని పార్టీ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత సంపూర్ణ మద్దతు ప్రకటిస్తామన్నారు. ఇప్పటి దాకా పార్టీ నుంచి పోటీ చేసిన వ్యక్తులు వారి సొంత ప్రయోజనాలకే పార్టీని వీడారే తప్ప నిజమైన కార్యకర్తలు, నాయకులు పార్టీతోనే ఉన్నారన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేషయాదవ్ నాగేందర్‌గౌడ్, ఉమేష్‌సింగ్, బీకే శ్రీను, పాండు, సానాది శంకర్ పాల్గొన్నారు.

మహనీయులను వదలని రాజకీయం

- గుండ్లపోచంపల్లిలో నాయకులపై పీఎస్‌లో ఫిర్యాదు
- పోటాపోటీగా అంబేడ్కర్, గాంధీ విగ్రహాల ఏర్పాటు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ రాజకీయ నాయకులు మహనీయులు విగ్రహాల ఏర్పాటులో తమ రాజకీయాన్ని ప్రదర్శిస్తున్నారు. సాధారణంగా రాజకీయం చేసే నాయకులు ఎన్నికల్లో లేదా తాము ఉన్న ప్రాంతాల్లో అవతలి వారిని దెబ్బతీసేందుకో.. లేదా తమ భవిష్యత్‌కు ఢోకా లేకుండా చేసుకోవడానికి, ప్రజల్లో తమ పట్టు పెంచుకోవడానికి ఎత్తుకు పైఎత్తులు వేస్తూ రాజకీయం చేస్తారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్, బీజేపీ, మాజీ సర్పంచ్‌కు పలువురు నాయకులు అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలను ఏర్పాటు చేసి పోలీస్‌స్టేషన్ వరకు చేరారు.



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట రెండు వర్గాల వారు ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలు

ఈశ్వర్‌తో మొదలై.. శ్రీనివాస్‌రెడ్డి వరకు..

గుండ్లపోచంపల్లిలో మహనీయుల విగ్రహాలతో మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్‌తో రాజకీయం మొదలై బీఆర్ఎస్ నాయకుడు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి వరకు చేరగా మధ్యలో బీజేపీ నాయకులు చేరారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీగా మారకముందు చివరి సర్పంచ్‌గా ఉన్న బేరి ఈశ్వర్ ఐదేళ్ల క్రితం తన పదవి చివరి దశలో మినీ ట్యాంక్‌బండ్‌పై జాతికి సేవలు అందించిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట 60అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. గత మే నెలలో రాష్ట్రంలోని అతిరథ మహారథులు, మంత్రి మల్లారెడ్డిని కార్యక్రమానికి పిలిచి విగ్రహాలను ఆవిష్కరింపజేశారు. ఐదేళ్లు మినీ ట్యాంక్‌బండ్‌పై నేతల విగ్రహాల ముఖాలు ముసుగులతో ఉన్నా రాజకీయ కారణాలతో ఏ నాయకుడు, మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు ముసుగులు తీసి ప్రారంభించిన పాపానపోలేదు. ఈశ్వర్ బీఆర్ఎస్ నాయకుడే అయినప్పటికీ ఆయన స్వపక్షంలో విపక్షం నాయకుడిగా ఉండటంతో ఆయన జోలికి అధికార పక్షం నాయకులు వెళ్లలేదు.

ఆధిపత్య పోరులో..

15 రోజుల క్రితం మున్సిపల్ కార్యాలయం ఎదుట 60 అడుగుల మహాత్మాగాంధీ విగ్రహం రాత్రికి రాత్రే వెలిసింది. మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ భర్త శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేశారు. సోమవారం గాంధీ జయంతి సందర్భంగా మంత్రి మల్లారెడ్డి ఆ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంతో క్రెడిట్ ఈశ్వర్‌కు దక్కుంతుందనే రాజకీయంతో మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటు చేయించారని గ్రామంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇద్దరు మాజీ సర్పంచ్‌ల మధ్య ఆధిపత్య పోరులో మహనీయులను రాజకీయాలకు వాడుకుంటున్నారు.

మధ్యలో బీజేపీ నాయకులు..

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చేసిన సమయంలో కిమ్మనని బీజేపీ నాయకులు మహాత్మా గాంధీ విగ్రహం ఏర్పాటు చేసే సమయంలో మాత్రం మున్సిపల్ కార్యాలయం ఎదుట గాంధీజీ విగ్రహం ఏర్పాటు చేస్తే రోడ్డు ఇరుగ్గా మారుతుందని, విగ్రహం ఏర్పాటుతో పూర్తిగా రాజకీయం చేస్తున్నారని, ఏర్పాటు చేయవద్దని కమిషనర్‌కు వినతి పత్రాలు ఇచ్చి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఒక విగ్రహం ఏర్పాటు చేసినా రెండు విగ్రహాలు ఏర్పాటు చేసినా రోడ్డు ఇరుగ్గా మారుతుందని బీజేపీ నాయకులకు ముందుగా తెలియదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. కేవలం రాజకీయాల కోసం నేతలు విగ్రహాలను అడ్డుపెట్టుకుంటారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ముందస్తు అరెస్టుల మధ్య..

బీజేపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఈశ్వర్ అతడి అనుచరులు గాంధీజీ విగ్రహ ఆవిష్కరణను అడ్డుకుంటారనే ముందు ఆలోచనలతో నాయకులను పేట్‌బషీరాబాద్ పోలీసులు సోమవారం ఉదయం ముందస్తు అరెస్టులు చేయగా మధ్యాహ్నం మంత్రి మల్లారెడ్డి ఆవిష్కరించారు.

మంత్రి, మున్సిపల్ చైర్ పర్సన్‌పై ఫిర్యాదు..

మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి మల్లారెడ్డి, ఏర్పాటు చేసిన, సహకరించిన బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరెడ్డి ఆమె భర్త మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, కమిషనర్ రాములుపై మాజీ సర్పంచ్ ఈశ్వర్ పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఈశ్వర్ న్యాయస్థానంలో పిల్ దాఖలు చేశారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

ఘట్‌కేసర్: పెంచిన వేతనాలతో పాటు పెండింగ్ బిల్లుల సాధన కోసం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ మండల కేంద్రంలో బుధవారం చేపట్టిన నిరసనలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనకు మద్దతు తెలిపిన సీఐటీయూ మండల కార్యదర్శి సబిత మాట్లాడుతూ.. పెంచిన వేతనాలు, పెండింగ్ బిల్లులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం యూనియన్ మండల అధ్యక్షురాలు పుష్ప, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు ప్రేమలత, సభ్యులు సంతోష్, ధనలక్ష్మి, అన్నపూర్ణ, శోభారాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మేడ్చల్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: రాష్ట్రానికి సమ్మక్క సారక్క పేరుతో గిరిజన యూనివర్సిటీని ప్రధాని నరేంద్రమోదీ మంజూరు చేయడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మేడ్చల్‌లో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రధాని మోదీ చిత్రపటం ఏర్పాటు చేసి అభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్, మోహన్‌రెడ్డి, జగన్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, ప్రేందాస్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



మేడ్చల్: హక్కుల సాధన కోసం ఆశ వర్కర్లు మేడ్చల్‌లో సమ్మె చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమావేశం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. హక్కుల సాధన కోసం తాము సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. సమ్మెకు బీఎస్పీ నాయకులు సత్యం, వెంకటేష్‌చారి, జంగయ్య, శంకర్ తదితరులు సంఘీభావం తెలిపారు.

స్థానికులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

ఘట్‌కేసర్: మండలంలోని స్థానికులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని సీపీఐ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ తహసీల్దారు ఆఫీస్ వద్ద బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి ఈశ్వర్ మాట్లాడుతూ.. మీ సేవ ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇళ్లు కేటాయిస్తామని సీఎం కేసీఆర్ 2016లో హామీ ఇచ్చారని, హామీ నిలబెట్టుకోవాని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో నిర్మించిన 23 వేల ఇళ్లలో స్థానికులకు 40 శాతం ఇస్తామని 10 శాతానికి కుదించడం అన్యాయం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థానికులకు ఎక్కువ శాతం ఇళ్లను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ లీడర్ సయ్యద్ ఖదీర్, నాయకులు సోమన్న, రాజమ్మ, శ్రీలత, సుజాత, సుబేదా, షకీలా, రేఖ, బాలమణి తదితరులు పాల్గొన్నారు.



డబుల్ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్న స్థానికులు

మేడ్చల్ డీఎంహెచ్ఓగా డాక్టర్ టి.రఘునాథస్వామి

పదోన్నతిపై ఖైరతాబాద్‌కు డాక్టర్ పుట్ల శ్రీనివాస్

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణలో 1998 బ్యాచ్‌కు చెందిన 13 మంది డిప్యూటీ సివిల్ సర్జన్లకు పదోన్నతి కల్పిస్తూ.. ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు పోస్టింగ్‌లను ఖరారు చేసింది. అందులో భాగంగానే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్ఓ) డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పదోన్నతిపై నగరంలోని ఖైరతాబాద్ జోన్ డీఎంహెచ్ఓగా బదిలీ అయ్యారు. అలాగే, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్ఓ)గా డాక్టర్ టి.రఘునాథస్వామి పదోన్నతిపై నియమితులయ్యారు. శుక్రవారం ఆయన మేడ్చల్ డీఎంహెచ్ఓగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.

పేదల కాలనీల్లో మంత్రి సొంత నిధులతో సీసీరోడ్లు

కీసర: మంత్రి మల్లారెడ్డి సొంత నిధులతో నిరుపేదలు నివసించే కాలనీల్లో సీసీరోడ్లు వేయడం అభినందనీయమని నాగారం మున్సిపల్ 14వ వార్డు కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు ఇందిరా ప్రియదర్శిని కాలనీలో మంత్రి మల్లారెడ్డి తన సొంత నిధులు సుమారు రూ.30 లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి తమ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేదల కోసం అనేక అభివృద్ధి పనులతో పాటు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



నాగారం ఇందిరాప్రియదర్శిని కాలనీలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ తదితరులు

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం పలు కాలనీల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ వెంకట్‌గౌడ్ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని గుండ్లపోచంపల్లి గ్రామం, ఏజీ కాలనీ, అపర్ణ కన్‌స్ట్రక్షన్స్, ఖాజాగూడ రోడ్డు, అయోధ్య రోడ్డు, గోల్డెన్ లీఫ్స్ కాలనీ, గోల్డెన్ ప్లాజా, లక్ష్మీనగర్ కాలనీ, మాణిక్యరెడ్డినగర్, నైబర్‌హుడ్‌కాలనీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. కండ్లకోయ పరిధిలోని గోద్రెజ్ ఫీడర్ పరిధిలోని అన్ని సర్వీసులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు.

అర్హులందరికీ.. గృహలక్ష్మి, 'డబుల్' ఇళ్లు

రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అర్హులందరికీ అసెంబ్లీ నియోజకవర్గంలో గృహలక్ష్మి పథకం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్.. దేశంలోని ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తూ.. ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మేడ్చల్ నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు గృహలక్ష్మీ పథకానికి సంబంధించిన మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గృహలక్ష్మి పథకం కింద ఖాళీ స్థలం ఉన్న వారు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో ఎలాంటి నిరాశకు గురికావొద్దని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో 26 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉన్నాయని, అందులో 10 శాతం స్థానికులకు అందేలా చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సహకారంతోనే ప్రభుత్వ పథకాలు సాకారం అవుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రతి ఒక్కరినీ ధనవంతులను చేయాలన్న సంకల్పంతో దళిత, బీసీ, మైనార్టీ బంధు, గృహలక్ష్మీతో పాటు అనేక పథకాలను ప్రవేశపెట్టి, పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. గృహలక్ష్మి పథకం కింద మొదటి విడతగా మూడు వేల మందికి లబ్ధి చేకూర్చడం జరిగిందని.. వీటితో పాటు ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మి షాదీముబారక్, రైతుబంధు వంటి పథకాలు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రోడ్లు భవనాల శాఖ ఈఈ శ్రీనివాసమూర్తి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల నుంచి తరలివచ్చిన లబ్ధిదారులు పాల్గొన్నారు.



గృహలక్ష్మి పథకం మంజూరు పత్రాలను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో పథకాలు



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ, కీసర మండల పరిషత్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు బతుకమ్మ చీరలను ఆయన పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ రాజమల్లయ్య, ఎంపీడీఓ కె.ఎల్.వత్సలదేవి, సర్పంచులు నాయకపు మాధురి, మహేందర్‌రెడ్డి, పుట్ట రాజు, మాజీ ఎంపీపీ రామారం సుజాత, ఎంపీటీసీ సభ్యులు పండుగ కవిత, నేతలు బెలిదే రమేష్‌గుప్తా, వెంకటేష్, నారాయణ, భానుచందర్, శశికాంత్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెకు వైద్యం అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దే..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ వెంకటేశ్వర కాలనీకి చెందిన మల్లయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2 లక్షల ఎల్‌వోసీని బుధవారం మంత్రి చామకూర మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బండి నవీన్‌గౌడ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పల్లెకు, పట్టణానికి వైద్యాన్ని అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎన్నో రకాల పరీక్షలు చేస్తూ ఉచితంగా మందులు అందజేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఎల్‌వోసీని అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి



మేడ్చల్‌లో చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

బతుకమ్మ చీరల పంపిణీ

మేడ్చల్: బతుకమ్మ పండగ సందర్భంగా ప్రభుత్వం మహిళలకు అందజేస్తున్న బతుకమ్మ చీరలను మేడ్చల్‌లో మంత్రి మల్లారెడ్డి బుధవారం అందజేశారు. 37మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. యువత కోసం స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజవిజయానందరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్లు దీపికనర్సింహారెడ్డి, లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసమే..



జవహర్‌నగర్‌లో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసమే బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం మంత్రి మల్లారెడ్డి, మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌ల చేతులమీదుగా ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు జిట్టా శ్రీవాణిశ్రీనివాస్‌రెడ్డి, మెట్టు ఆశాకుమారి, నాగరాణివెంకటేష్‌గౌడ్, సంగీతరాజశేఖర్, రాజ్‌కుమార్, కో–ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, రెడ్డిశెట్టి మహేష్, ఉద్యమకారులు సుధాకర్‌చారి, బాలరాజు, మహేష్ పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



శామీర్‌పేటలో క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట్: శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో బుధవారం మంత్రి మల్లారెడ్డి పర్యటించి బతుకమ్మ చీరలను అందజేశారు. అనంతరం బొమ్మరాశిపేటలోని అర్హులైన 100 మందికి ఇళ్ల పట్టాలను అందజేశారు. యువతకు క్రీడా సామాగ్రి అందజేశారు. ఎంపీపీలు హారిక, యెల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, ఎంపీడీఓలు వత్సలదేవి, వాణి, పలువురు సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.